క్లుప్తంగా

మహిళల హక్కులు కాపాడాలి



ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

దర్శి: మహిళల హక్కులు కాపాడాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్‌వీ రమణ అన్నారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థినులతో లింగ ఆధారిత హింస నిర్మూలనా ర్యాలీ ప్లకార్డులతో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ఎస్‌వీ రమణ మాట్లాడుతూ మహిళల హక్కుల పరిరక్షణ చట్టాలను పటిష్టంగా అమలు చేయాలన్నారు. రక్షణ చట్టాలపై అవగాహన కల్పించడం ప్రస్తుత సమాజానికి అవసరమన్నారు. మహిళా సాధికారత సెల్ కో ఆర్డినేటర్ ప్రవీణ, విద్యార్థులు, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్సీలను వర్గీకరించాలి



వినతిపత్రం సమర్పిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

తాళ్లూరు: ఎస్సీలను వర్గీకరించాలని కోరుతూ మండల షెడ్యూల్డ్ కులాలకు చెందిన వారు సోమవారం ఒంగోలులో ఏకసభ్య కమిషన్ ఆర్‌ఆర్ మిశ్రాకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎస్సీలను ఏబీసీడీలుగా వర్గీకరించాలని కోరారు. ఎమ్మార్పీఎస్‌నాయకులుపాల్గొన్నారు

రెవెన్యూ సదస్సులో అర్జీల స్వీకరణ



అర్జీలు స్వీకరిస్తున్న తహసీల్దార్ రమాదేవి

దొనకొండ: మండలంలోని రుద్రసముద్రంలో రెవెన్యూ సిబ్బంది సోమవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజల నుంచి 8 అర్జీలు వచ్చినట్లు తహసీల్దార్ బి.రమాదేవి తెలిపారు. రెవెన్యూ సదస్సులో వచ్చిన అర్జీలను తప్పకుండా సిబ్బంది పరిశీలించి అర్హులైన వారికి మ్యూటేషన్, ఆన్‌లైన్ కల్పిస్తామని తహసీల్దార్ తెలిపారు. సర్పంచ్ ఏగినాటి వెంకట సుబ్బయ్య, వీఆర్‌ఓలు తాళ్ల శివకోటేశ్వరరావు, మాచర్ల, కాశయ్య, లైసెన్స్ సర్వేయర్ సీహెచ్ వెంకట్రావు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్సీలను క్రిస్టియన్‌లుగా మార్చేశారు

యర్రగొండపాలెం: ఎస్సీల వర్గీకరణలో భాగంగా స్థానిక సచివాలయం-2 పరిధిలోని ఎస్సీలను క్రిస్టియన్‌లుగా నమోదు చేశారని దళిత సంఘం నాయకులు ఆరోపిస్తున్నారు. దాదాపు 800 మంది పేర్లు నమోదు చేసిన అధికారులు 700 మంది ఎస్సీలను క్రిస్టియన్‌లుగా తమ రికార్డుల్లో నమోదు చేశారని తెలిపారు. ఈ విషయం గురించి ఎంపీడీవోను ప్రశ్నిస్తే సచివాలయాల వీఆర్వోలు ఇచ్చిన సమాచారం మేరకు ఎస్సీ వర్గీకరణ నమోదు చేశామని, అభ్యంతరాలు ఉంటే అర్జీలు పెట్టుకోవచ్చని అంటున్నారని పేర్కొన్నారు. వీఆర్వోలు తమ గృహాల వద్దకు రాకుండా వివరాలు ఎలా నమోదు చేశారని వారు ప్రశ్నిస్తున్నారు. వెంటనే కుల వర్గీకరణ జాబితాను పరిశీలించి వాస్తవ కులాన్ని రికార్డుల్లో నమోదు చేయాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

విద్యుదాఘాతంతో యువకుడికి తీవ్రగాయాలు

గిద్దలూరు రూరల్: వీధిలైట్లకు మరమ్మతులు చేస్తున్న ఓ ప్రైవేట్ ఎలక్ట్రీషియన్ విద్యుదాఘాతంతో తీవ్రంగా గాయపడ్డాడు. ఈ సంఘటన గిద్దలూరు మండలంలోని కొమ్మునూరులో సోమవారం చోటుచేసుకుంది. అందిన వివరాల ప్రకారం.. కొమ్మునూరు గ్రామంలో వీధిలైట్లు పనిచేయడం లేదు. గ్రామ కార్యదర్శి విజ్ఞప్తి మేరకు అంబవరం గ్రామానికి చెందిన ప్రైవేట్ ఎలక్ట్రీషియన్ ధన్‌రాజ్ వీధిలైట్లకు మరమ్మతులు చేస్తున్నాడు. ఈ సమయంలో ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌కు గురై స్తంభంపై నుంచి కిందపడ్డాడు. స్థానికులు హుటాహుటిన స్పందించి ఆటోలో గిద్దలూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. తీవ్రగాయాలపాలైన ధన్‌రాజ్‌ను పరీక్షించిన వైద్యులు అతడిని మెరుగైన వైద్యం నిమిత్తం కర్నూలు ఆస్పత్రికి సిఫార్సు చేశారు. ఈ మేరకు బంధువులు కర్నూలు వైద్యశాలకు తరలించారు.

రేపు డయల్ యువర్ డీఎం

గిద్దలూరు రూరల్: గిద్దలూరు ఆర్టీసీ డిపో పరిధిలోని ప్రయాణికుల సమస్యలను పరిష్కరించేందుకు ఈ నెల 8వ తేదీ ఉదయం 11 నుంచి 12 గంటల వరకు డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు డిపో మేనేజర్ బి.చంద్రశేఖర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రయాణికుల సౌలభ్యం కోసం వారి సూచనలు సలహాలు తెలుసుకునేందుకు డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఆర్టీసీ పరంగా ఏమైనా సమస్యలు తెలియజేయాలంటే 9959225702ను సంప్రదించాలని సూచించారు.

దినదిన గండం
నూరేళ్ల ఆయుష్షు

- ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని ప్రయాణం
- గతుకుల రోడ్లతో ప్రయాణికుల అవస్థలు



బస్సులు లేక ఆటోలో కిక్కిరిసి వెళ్తున్న ప్రయాణికులు

ముండ్లమూరు (దర్శి): మండలంలో ప్రయాణికుల పరిస్థితి దినదిన గండం నూరేళ్ల ఆయుష్షు అన్నట్లుగా ఉంది. మండలంలో ప్రధానమైన ముండ్లమూరు–దర్శి–అద్దంకి–తాళ్లూరు వంటి రోడ్లు మినహా ఎక్కడా గ్రామీణ ప్రాంతాలకు బస్సులు లేక పోవడంతో ప్రయాణికులు ఆటోల్లో కిక్కిరిసి ఎక్కుతున్నారు. ప్రాణాలు గుప్పెట్లో పెట్టుకుని మరీ ప్రయాణించాల్సి వస్తోంది. మరికొన్ని ప్రాంతాల్లో ఆటోల్లో మహిళలు సైతం వేలాడి ప్రయాణిస్తున్న తీరు మరింత ఇబ్బందికరంగా ఉంది. ఏక్షణాన ప్రయాణంలో ఏం జరుగుతుందో అని క్షణక్షణం భయం భయంగా తప్పనిసరి పరిస్థితుల్లో ప్రయాణాలు కొనసాగిస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల నుంచి పలు అవసరాల కోసం వచ్చే వారు ప్రయాణం చేయాలంటే నరక యాతన అనుభవిస్తున్నారు. గ్రామీణ ప్రాంత రోడ్లు సరిగా లేవు. దీనికి తోడు ప్రయాణానికి ఆటోల్లో పరిమితికి మించి ఎక్కడంతో ప్రయాణంలో తీవ్ర అలసటకు గురవుతున్నారు. ఎక్కడికైనా గ్రామాల నుంచి వెళ్లాలంటే ఏ వాహనం కనపడితే ఆ వాహనం ఎక్కి ప్రయాణం చేయాల్సిన దుస్థితి నెలకొంది. ట్రాక్టర్ గొర్రులపై కూర్చుని కూడా ప్రయాణం చేయడం చూస్తే ప్రయాణీలు పడుతున్న పరిస్థితి ఇట్టే అర్థం అవుతోంది. గ్రామీణ ప్రాంతాల నుంచి ఆస్పత్రి వంటి అత్యవసర సేవలకు వెళ్లాలంటే సమయానుకూలంగా బస్సులు లేక నానా అవస్థలు పడుతున్నారు. ఆర్టీసీ అధికారులు ఆదాయం ఉన్న ప్రాంతాల్లో మాత్రమే బస్సులు నడిపి మిగిలిన ప్రాంతాల్లో ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నారని ప్రజలు విమర్శిస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి గ్రామీణ ప్రాంతాల్లో ఆర్టీసీ బస్సులు పూర్తిస్థాయిలో నడపాలని ప్రజలు కోరుతున్నారు.



ఆటోలో వేలాడుతూ వెళ్తున్న ప్రయాణికులు



ట్రాక్టర్ గొర్రు ఎక్కి ప్రయాణిస్తున్న మహిళలు

ఈ–పంట నమోదు పరిశీలన



పంటల వివరాలు పరిశీలిస్తున్న తహసీల్దార్ సంజీవరావు



పెద్దదోర్నాల: ఈ-పంట నమోదు తీరును పరిశీలిస్తున్న ఏఓ

తాళ్లూరు: పంటల నమోదులో వివరాలు పారదర్శకంగా ఉండాలని తహసీల్దార్ సంజీవరావు అన్నారు. సోమవారం ఆయన మండలంలో రైతుల సాగు చేసిన పంటలను పరిశీలించారు. ఈ- పంట యాప్‌లో నమోదు చేసిన పంటల వివరాలు సరిగా ఉన్నాయో లేవో పరిశీలిస్తున్నట్లు ఏవో బి.ప్రసాద్‌రావు తెలిపారు. మండల సర్వేయర్ వై.శ్రీనివాసరావు, వీఆర్‌ఓ నాగలక్ష్మి, వీఓఏలు నాగరాజు నాయక్, విలేజ్ సర్వేయర్ ఖాదర్‌బాషా, రైతులు పాల్గొన్నారు.

పెద్దదోర్నాల: మండల పరిధిలోని హసానబాద్‌లో ఈ-పంట నమోదు చేసిన వ్యవసాయ భూములను వ్యవసాయాధికారి జవహర్‌లాల్ నాయక్ సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసిన ప్రతి పంటను రైతులు నమోదు చేసుకోవాలని సూచించారు. రైతులు తప్పని సరిగా ఈకేవైసీ చేయించుకోవాలన్నారు. ఈ సందర్భంగా పంటల బీమాపై రైతులకు అవగాహన కల్పించారు. ఏఈఓ చైతన్యకుమార్, వీఏఏ శివానాయక్ పాల్గొన్నారు.

డ్రోన్‌లతో పిచికారీ సులభతరం



డ్రోన్‌ను పరిశీలిస్తున్న ఏఓ లక్ష్మీనారాయణ

దొనకొండ: రైతులు సాగు చేసిన పొలాల్లో డ్రోన్‌లతో పురుగుమందులు నీటిలో కరిగే ఎరువులు పిచికారీ చాలా సులభమని మండల వ్యవసాయాధికారి ఎన్.లక్ష్మీనారాయణ తెలిపారు. మండలంలోని యర్రబాలెంలో థానోస్ కోరమండల్ కంపెనీ మన గ్రోమోర్ ద్వారా రైతుల పొలాల్లో పిచికారీ చేస్తున్నారని తెలిపారు. తక్కువ సమయంలో క్రిమిసంహారిక మందుల ఆదాతో తక్కువ నీటితో రైతుకు ప్రయోజనం చేకూర్చేలా పంటకు చీడ పీడ పురుగు నశించేలా డ్రోన్‌తో పిచికారీ చేస్తే రైతుకు ఆదా అవుతుందన్నారు. ఇంకా గ్రామాల్లోని రైతులు తమ పొలాల్లో డ్రోన్‌లతో పిచికారీ చేయాలంటే సంబంధిత మన గ్రోమోర్ మేనేజర్‌ను సంప్రదించాలని ఏఓ తెలిపారు. రైతు సేవా కేంద్రం సిబ్బంది రవితేజ, కమల పాల్గొన్నారు.

సీజనల్ జ్వరాలపై అప్రమత్తంగా ఉండాలి

పొదిలి రూరల్: డెంగీ, మలేరియా, చికున్‌గున్యా వ్యాధులు ప్రబలకుండా ఉండాలంటే ప్రజలు తాము నివాసం ఉండే పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలని రాష్ట్ర ఫ్యామిలీ వెల్ఫేర్ డిప్యూటీ డైరెక్టర్ రామ్‌నాథ్ సూచించారు. సోమవారం పొదిలి మండలంలోని ఈగలపాడు పంచాయతీలో జ్వరాల ప్రభావం ఎక్కువగా ఉండటంతో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ.. వాతావరణ మార్పులతో వచ్చే సీజనల్ జ్వరాలపై ప్రజలంతా అవగాహన కలిగి ఉండాలన్నారు. ఆవాస ప్రాంతంలో నీటి నిల్వలు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. జ్వర పీడితుల రక్త నమూనాలు సేకరించి డెంగీ, మలేరియా కిట్లతో పరీక్షించినట్లు తెలిపారు. సాయంత్రం సమయంలో దోమల వ్యాప్తిని నివారించడానికి ఫాగింగ్ చేయడంతోపాటు బ్లీచింగ్ పౌడర్ చల్లించారు. కార్యాక్రమంలో డీఎంఓ శ్రావణకుమార్, ఎంపీడీఓ శోభన్‌బాబు, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ టి.సుగుణకుమార్, డాక్టర్ శరత్‌చంద్ర, ఏఎన్‌ఎంలు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజా సంకల్ప వేదిక కమిటీలో పలువురికి పదవులు



మునీర్



వెంకటేశ్వర్లు



మల్లికార్జున్

మార్కాపురం: ప్రజా సంకల్ప వేదిక రాష్ట్ర కమిటీలో మార్కాపురం వాసులకు పదవులు లభించాయి. ఆర్‌టీఐ విభాగం నుంచి రాష్ట్ర సహాయ కార్యదర్శిగా షేక్ మున్నీర్ బాషా, ఆర్‌టీఐ అడ్వైజర్‌గా తిప్పనబోయిన మల్లికార్జున, మీడియా రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా కల్లూరి వెంకటేశ్వర్లును నియమిస్తూ కమిటీ అధ్యక్షులు మదిరె రంగసాయిరెడ్డి తెలిపారు. ఆదివారం గుంటూరులో నిర్వహించిన సమావేశంలో కమిటీని ఎంపిక చేసినట్లు పేర్కొన్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని నూతన కమిటీ సభ్యులు చెప్పారు.

భక్తిశ్రద్ధలతో తిరుప్పావై సేవ



తిరుప్పావై సేవలో పాల్గొన్న భక్తులు

మార్కాపురం: పట్టణంలోని కంభం రోడ్డులో ఉన్న ప్రసన్న వెంకటేశ్వరస్వామి ఆలయంలో ధనుర్మాసం సందర్భంగా నిర్వహిస్తున్న తిరుప్పావై ప్రత్యేక పూజల్లో భాగంగా మహిళా భక్తులు సోమవారం గోదాదేవికి 22వ పాశురం చదివి పూజలు నిర్వహించారు. సంక్రాంతి పండగ వరకు ధనుర్మాస పూజలను వైష్ణవ ఆలయాల్లో ప్రత్యేకంగా నిర్వహిస్తున్నారు. శ్రీలక్ష్మి చెన్నకేశవస్వామి, కల్యాణ వెంకటేశ్వరస్వామి ఆలయాల్లో కూడా తిరుప్పావై ప్రత్యేక పూజలు అర్చకులు నిర్వహిస్తున్నారు. కార్యక్రమంలో కమిటీ కార్యదర్శి నిట్టూరి రమేష్‌తోపాటు సభ్యులు పాల్గొన్నారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు.

మంచానికే పరిమితమైన పింఛన్ లబ్ధిదారుల పరిశీలన



వృద్ధురాలి ఆరోగ్య పరిస్థితిని పరిశీలిస్తున్న వైద్యాధికారులు

పెద్దదోర్నాల: అనారోగ్యంతో మంచానికే పరిమితమై రూ.15 వేల పింఛన్ తీసుకుంటున్న లబ్ధిదారులను వైద్యాధికారుల బృందం సోమవారం పరిశీలించింది. ఈ సందర్భంగా మండల కేంద్రంలోని నాలుగో సచివాలయం పరిధిలో ముగ్గురు, మూడో సచివాలయం పరిధిలో ఒక్కరు, రెండో సచివాలయం పరిధిలో ఒక్కరు, చిన్నగుడిపాడు సచివాలయం పరిధిలో ఇద్దరు, పెద్దబొమ్మలాపురం సచివాలయం పరిధిలో ఐదుగురు లబ్ధిదారుల ఆరోగ్య స్థితిగతులను వైద్యాధికారులు స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఆదేశాల మేరకు పింఛన్ లబ్ధిదారుల ఆరోగ్య స్థితిగతులను పరిశీలించినట్లు వైద్యులు పేర్కొన్నారు. డాక్టర్ సయ్యద్ అబ్దుల్ కలాం, డాక్టర్ సాయికిరణ్, డాక్టర్ శంకర్‌రెడ్డి, ఎంపీడీఓ నాసర్‌రెడ్డి, సీహెచ్‌ఓ మందగిరి రాజేష్, సచివాలయ సిబ్బంది, ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రాల కమ్యూనిటీ హెల్త్ అధికారులు, ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.



ఆల్ ఇన్ వన్‌లు పంపిణీ చేస్తున్న జెడ్పీటీసీ నాగిరెడ్డి, ఇతర నాయకులు, ఉపాధ్యాయులు

విద్యార్థుల అభ్యున్నతే బూచేపల్లి లక్ష్యం

కురిచేడు: విద్యార్థుల అభ్యున్నతే దర్శి ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, జిలా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ లక్ష్యమని జెడ్పీటీసీ నుసుం వెంకట నాగిరెడ్డి అన్నారు. స్థానిక వైఆర్ జెడ్పీ హైస్కూల్లో బూచేపల్లి వెంకాయమ్మ, సుబ్బారెడ్డి చారిటబుల్ ట్రస్ట్ ద్వారా పదో తరగతి విద్యార్థులకు ఆల్ ఇన్ వన్ మెటీరియల్ సోమవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నాగిరెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు మంచి మార్కులతో పాసై పాఠశాలకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని కోరారు. బూచేపల్లి కుటుంబం 20 ఏళ్లకుపైగా విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ వంటి మంచి కార్యక్రమాలు నిర్వహిస్తున్నారన్నారు. విద్యార్థుల భవిష్యత్ బాగుండాలని నిత్యం తపించే వ్యక్తి బూచేపల్లి.. అని కొనియాడారు. ప్రతి పేద విద్యార్థి ఉన్నత చదువులు చదవాలని మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి, బూచేపల్లి కుటుంబాలు మొదటి నుంచీ కలలు కంటున్నారని చెప్పారు. ఆ కలలను సాకారం చేసే దిశగా ప్రతి విద్యార్థి చక్కగా చదువుకుని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని నాగిరెడ్డి విజ్ఞప్తి చేశారు. ఎంఈఓ వస్త్రం నాయక్, ఎంపీటీసీ బుల్లం వెంకట నరసయ్య, స్కూల్ కమిటీ చైర్మన్ మల్లికార్జునరావు, వైస్ చైర్మన్ అంకె గోపాలకృష్ణ, ప్రధానోపాధ్యాయుడు సాయి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉద్యమ పితామహుడు మార్పు బాలకృష్ణమ్మ



మార్పు బాలకృష్ణమ్మకు నివాళులర్పిస్తున్న నాయకులు, విద్యార్థులు

దర్శి: ఉద్యమాలకు ఊపిరి పోసిన ఉద్యమ పితామహుడు మార్పు బాలకృష్ణమ్మ..అని ఏపీటీఎఫ్ 1938 రాష్ట్ర కార్యదర్శి కేవీజీ కీర్తి కొనియాడారు. దర్శిలో మార్పు బాలకృష్ణమ్మ 12వ వర్ధంతిని సోమవారం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా కేవీజీ కీర్తి మాట్లాడుతూ కమ్యూనిస్టు భావాలను పుణికి పుచ్చుకుని తుదిశ్వాస విడిచే వరకూ ఉద్యోగ, ఉపాధ్యాయ సమస్యలపై పోరాట పంథానే కొనసాగించారన్నారు. శాసన మండలి సభ్యునిగా మండలిలో ప్రోగ్రెసివ్ డెమోక్రటిక్ ఫ్రంట్‌కు నాయకుడిగా ఉండి మండలిని ఉపాధ్యాయ ఉద్యమ వేదికగా మార్చారన్నారు. 30 ఏళ్లు ఏపీటీఎఫ్ 1938 అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా కొనసాగారన్నారు. జిల్లా అధ్యక్షుడు బి.వెంకట్రావు, జిల్లా కార్యదర్శి కె.వెంకటేశ్వర్లు, సీనియర్ నాయకులు రవీంద్రరావు, బి.రంగారావు, మండల శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.వెంకటేశ్వరరావు, బుర్రి శ్రీనివాసులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా ముగ్గుల పోటీలు



ముగ్గులు వేస్తున్న విద్యార్థినులు

దొనకొండ: స్థానిక గౌతమి డిగ్రీ కళాశాల ఆవరణలో సోమవారం నూతన సంవత్సరంలో మొదట వచ్చే సంక్రాంతి సందర్భంగా విద్యార్థులకు ముగ్గుల పోటీలు కళాశాల అడ్మిన్ నానీ నిర్వహించారు. గౌతమి విద్యా సంస్థల చైర్మన్ కనుమర్ల గుండారెడ్డి ఆదేశాల మేరకు పోటీలు నిర్వహించామన్నారు. ముగ్గుల పోటీలకు గౌతమి కాలేజీ, ప్రభుత్వ జూనియర్, జెడ్పీ స్కూల్, కేజీబీవీ, వివేకానంద పాఠశాలల విద్యార్థులు ఉత్సాహంగా ముగ్గులు వేశారు. ముగ్గుల పోటీలకు న్యాయ నిర్ణేతలుగా అధ్యాపకులు మహాలక్ష్మి, కవిత, శారద వ్యవహరించారు. వివేకానంద విద్యార్థి అనుష్క ప్రథమ, గౌతమి డిగ్రీ కళాశాల విద్యార్థి వై.నాగమ్మ ద్వితీయ, కేజీబీవీ విద్యార్థి ఎస్.నాగజ్యోతి తృతీయ స్థానాల్లో నిలిచారు. విజేతలకు ప్రిన్సిపాల్ రామయోగి, అడ్మిన్ నాని బహుమతులు అందజేశారు. అధ్యాపకులు దేవదానం, వెంకటేశ్వరరెడ్డి, మల్లికార్జున, విద్యార్థులు పాల్గొన్నారు.



ముగ్గులు వేస్తున్న ఇంజినీరింగ్ విద్యార్థినులు

ఏ1 కాలేజీలో రంగవల్లుల సంబరం

మార్కాపురం: స్థానిక ఏ1 గ్లోబల్ ఇంజినీరింగ్ కళాశాలలో సోమవారం సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకుని చైర్మన్ డాక్టర్ మీర్జా షంషేర్ ఆలీబేగ్ ఆధ్వర్యంలో సంబరాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అన్ని కులాలు, మతాలు గౌరవించడం, అన్ని వర్గాల పండగలను నిర్వహించుకోవడం ప్రజలందరి బాధ్యత అని పేర్కొన్నారు. కళాశాలలో ఏటా అన్ని రకాల పండగలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ముగ్గుల పోటీలో విద్యార్థినులు ఆసక్తిగా పాల్గొని రంగవల్లులను తీర్చిదిద్దారు. విజేతలకు బహుమతులు అందించనున్నట్లు చైర్మన్ తెలిపారు.

రవాణా కార్మికుల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

గిద్దలూరు రూరల్: రవాణా కార్మికుల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని ప్రైవేట్ స్కూల్ బస్సు డ్రైవర్ల యూనియన్ అధ్యక్షుడు టి.పిచ్చిరెడ్డి కోరారు. పట్టణంలోని యూటీఎఫ్ కార్యాలయంలో సోమవారం రవాణా కార్మికులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా వివిధ ప్రైవేట్ విద్యా సంస్థల్లోని బస్సులకు వేల మంది డ్రైవర్లు, క్లీనర్లు, వాచ్‌మెన్‌లు, స్వీపర్లు, అటెండర్లు పనిచేస్తున్నారన్నారు. కార్మికులకు పీఎఫ్, ఈఎస్ఐ, ప్రమాద బీమా తదితర సంక్షేమ పథకాలు అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు టి.ఆవులయ్య, యూనియన్ నాయకులు నాగభూషణం, రహీం, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.